సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 14 । మార్చి । 2025

వాతావరణం

అనకాపల్లి : రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పొడిగా ఉండే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు ఐదు రోజులు 36.8 నుంచి 38.5 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 22.5 నుంచి 23.8 డిగ్రీలు ఉండవచ్చన్నారు.



నేత్రపర్వం.. వెంకన్న తోట ఉత్సవం

ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవాల అనంతరం తోట ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

8లో



న్యూస్‌రీల్

స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా జర్మనీలో ఉద్యోగావకాశాలు

అనకాపల్లి టౌన్ : రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని డిప్లొమా, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఎనర్జీ సిస్టం ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ఎన్. గోవిందరావు తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాల యువతీ యువకులు ఏదైనా రంగంలో మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అర్హులైన వారికి ఇంగ్లీష్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తామని, అలాగే నాలుగు నెలల పాటు జర్మన్ భాషపై శిక్షణ ఇస్తామని, శిక్షణ సమయంలో వారికి జర్మన్ భాషపై పట్టు రావడంతో పాటు ఎ2 ఎగ్జామ్ పాస్ అయిన తర్వాత వారిని జర్మనీకి పంపించడం జరుగుతుందన్నారు. సెలక్ట్ అయిన వారికి వీసా, విమాన ఛార్జీలు కూడా ఇస్తామన్నారు. జర్మన్ భాషపై శిక్షణ తరగతులు విజయవాడ, విశాఖపట్నంలో ఉంటాయన్నారు. అలాగే వీరికి నెలకు రెండు లక్షల యాభై వేల నుంచి మూడు లక్షల రూపాయలు జీతం ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెంబర్లను 9988853335, 8712655686 సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

సారా రహిత రాష్ట్రం కోసమే నవోదయం 2.0



పూడిమడకలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

అచ్యుతాపురం రూరల్ : నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం పూడిమడకలో సారాకు వ్యతిరేకంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నం జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డి.శ్రీరామ చంద్ర మూర్తి, అనకాపల్లి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా ఏపీ ప్రొహిబిషన్ చట్టం 1995 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సారా సంబంధిత ఫిర్యాదుల కోసం 14405 టోల్ ఫ్రీ నంబరుకు తెలియజేయాలని సూచించారు. సారా రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు. యలమంచిలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ పి.తేజో వెంకట కుమార్, ఎస్ఐ సుధాకర్, ఎస్ఐ వెంకటరావు, మహిళా పోలీసులు రేవతి, రత్నకుమారి, వీఆర్వో కిరణ్ పాల్గొన్నారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు శుక్రవారం విశాఖ వస్తున్నారు. మధ్యాహ్నం 1.50 గంటలకు విజయవాడ నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ చేరుకొని ప్రభుత్వ గెస్టు హౌస్‌లో బస చేస్తారు. అక్కడ నుంచి విజయనగరం వెళ్తారు. రాత్రి తిరిగి విశాఖ చేరుకొని బస చేస్తారు. 15న రాత్రి విమానంలో విజయవాడ వెళ్తారు.

పసుపు సాగుకు సిరుల ఛాయ



- మాడుగుల పసుపునకు భలే గిరాకీ
- రంగు, నాణ్యతలో టాప్
- ఏజెన్సీలో విరివిగా పసుపు సాగు
- మాడుగుల, ఎస్.కోట, నర్సీపట్నం కేంద్రాలకు లక్షలాది టన్నుల సరఫరా
- ఏటా 1100 కుటుంబాలకు జీవనోపాధి
- రూ.96 కోట్ల టర్నోవర్

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో విశాఖ ఏజెన్సీలో పూర్తి స్థాయిలో గంజాయి సాగును అరికట్టడంతో రెండేళ్లుగా ఏజెన్సీ రైతులు పసుపు, పిప్పలి సాగుపై దృష్టి సారించారు. ప్రస్తుతం పసుపు సాగు సులువుగా ఉండడంతో పాటు అధిక లాభాలు వస్తుండడంతో ఏజెన్సీలో 11 మండలాల్లో పలువురు రైతులు గంజాయి వదిలి పసుపు సాగుపై దృష్టి సారించారు. మూడేళ్లుగా ధరలు పెరుగుతూ వస్తుండడంతో పసుపు సాగు పెరుగుతూ వస్తోంది. దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో మాడుగుల పసుపునకు మంచి డిమాండ్ ఉంది.



ఏజెన్సీ నుంచి వచ్చిన దుంప పసుపు ఎండబెట్టిన దృశ్యం



పసుపు దుంపలు గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

మాడుగుల : ఉమ్మడి విశాఖ జిల్లాలో మన్యం ముఖద్వారమైన మాడుగుల పసుపు వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఏజెన్సీలో 11 మండలాల్లో పండించిన పసుపు మాడుగుల పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలకు సరఫరా అవుతుంది. గతంలో 3 వేల ఎకరాలకు పరిమితమైన పసుపు సాగు నేడు 6 వేల ఎకరాలకు పైగా పెరిగింది. ఏజెన్సీ 11 మండలాల నుంచి 80 కిలోలున్న బస్తాలు 80 వేల బస్తాలు వచ్చేవి. ఈ ఏడాది సుమారు లక్షా 70 వేల బస్తాలు సరఫరా అవుతాయని రైతులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

పసుపు ప్రాసెసింగ్ ఇలా...

విశాఖ ఏజెన్సీలో పండించిన పసుపు దుంపలు మాడుగుల చేరాక, అక్కడ డ్రమ్ముల్లో వేసి ఉడక బెట్టి ప్రాసెసింగ్ చేస్తారు. అనేకమైన ప్రాసెసింగ్ తరువాత ఆరెంజ్ ఎల్లో రంగుకు మారిన తరువాత ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి ఎగుమతులు చేస్తారు. పంట పండించే దగ్గర నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పసుపు వ్యాపారంపై సుమారు 1100 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు.

అంతర్జాతీయంగా గుర్తింపు

దక్షిణ భారతదేశంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో నర్సీపట్నం, పాలకొండ, రాజమండ్రి, వరంగల్, నిజామాబాద్, దుగ్గిరాల, తమిళనాడు, కేరళ, ఒడిశా, కురుపాం, ఈరోడ్డు, బరంపురంలో పసుపు పరిశ్రమలున్నాయి. ఉత్తరాంధ్రాలో మాడుగుల, ఎస్.కోట, తుని, నర్సీపట్నం, సాలూరుల్లో పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలున్నాయి. కానీ మాడుగుల పసుపునకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. విశాఖ మన్యంలో పండించే పసుపులో అధిక కుర్కుమిన్‌తో పాటు, చర్మ సౌందర్యానికి ఉపయోగపడే, ఓలంట యిల్ ఉండడమే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. మిగతా ప్రాంతాల పసుపులో 2 శాతం కుర్కుమిన్ ఉంటే మాడుగుల పసుపులో మాత్రం 5 శాతం కుర్కుమిన్ ఉండడంతో పాటు రంగు ఆరంజ్ ఎల్లో కావడంతో మంచి క్రేజ్ ఉంది. నాణ్యమైన పసుపు కావడంతో సౌందర్యానికి, వివిధ రకాల వంటకాల్లోనూ ఈ పసుపు విరివిగా వినియోగించడం వల్ల డిమాండ్ బాగుంటుంది.

పసుపు ఎగుమతులు ఇలా

ఈ ప్రాంతంలో పండించే దుంప పసుపు సుమారు 300 ఏళ్ల నుంచి వ్యాపారుల ద్వారా మాడుగుల చేరుకుంటుంది. మాడుగులలో సుమారు 10 పసుపు ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా ఛాయ పసుపు తయారు చేస్తున్నారు. ఏటా సుమారుగా 800 లారీల పసుపు డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు మాడుగుల ప్రాసెసింగ్ కేంద్రాలకు చేరుకుంటుంది. ఇక్కడ అనేక రకాలుగా ప్రాసెసింగ్ చేసిన తరువాత గ్రేడింగ్ చేసి మేలిమి పసుపు, నార పసుపు విడివిడిగా ప్యాకింగ్ చేసి ఎగుమతులు చేస్తారు. సుమారు 500 లారీల వరకు చెన్నైకి ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తారు. మరో 200 లారీల వరకు కొచ్చిన్‌కు ఎగుమతులు చేస్తారు. 100 లారీల వరకు స్థానికంగా శుభకార్యాలతో పాటు వంటకాల కోసం వ్యాపారులకు విక్రయాలు జరుగుతాయి. బస్తా 80 కిలోల చొప్పున ఒక్కో లారీకి 125 బస్తాలు ఎగుమతులు చేస్తారు. ఈ లెక్కన 800 లారీలకు కిలో పసుపు రూ.125 చొప్పున ప్రతి ఏటా సుమారుగా రూ.96 కోట్ల టర్నోవర్ ఉంటుంది.



ప్రాసెసింగ్ అనంతరం రంగు మారిన పసుపు

అధిక కుర్కుమిన్‌తో గిరాకీ



కుర్కుమిన్ అధికంగా ఉండే పసుపు ఎక్కువగా తమిళనాడులో ఉపయోగిస్తున్నారు. ఔషధ తయారీలో కూడా ఉపయోగించడంతో మాడుగుల పసుపునకు మంచి గిరాకీ ఉంది. గతంలో కిలో పసుపు ధర రూ.70 నుంచి రూ.90 వరకు పలికేది. రెండేళ్లుగా రూ. 120 నుంచి రూ.140 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈ ఏడాది సీజన్ తొలినాళ్లలోనే రూ.125 పలకడం విశేషం. దీంతో అటు రైతులకు, ఇటు వ్యాపారులకు లాభాలు వస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంజాయి అరికట్టడంతో ఏజెన్సీలో అందుకు ప్రత్యామ్నాయంగా పసుపు సాగు పెరిగింది.

– నూతిగట్టు నాగశంకర్,
పసుపు వ్యాపారి, మాడుగుల

అన్నం ఇలాగేనా వండేది...

- రైల్వేస్టేషన్ రోడ్డు జెడ్పీ పాఠశాలలో ఆహార కమిషన్ సభ్యురాలి తనిఖీలు
- నాణ్యత లేకపోవడంపై ఆగ్రహం
- కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

యలమంచిలి రూరల్ : రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు జి.దేవి గురువారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి విద్యార్థులకు, పిల్లలకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆయా పాఠశాలల పరిసరాలు, వండిన ఆహార పదార్థాల నాణ్యత, నిర్దేశిత కొలతల్లో ఆహార పదార్థాలు వండి పెడుతున్నారో లేదో పరిశీలించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు పాఠశాలలో వండిన అన్నం ముద్దగా ఉండడం, కొంతమంది విద్యార్థులకు అన్నం చాలకపోవడంతో ఆమె వంట ఏజెన్సీ నిర్వాహకులు,పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నం ఎందుకు ముద్ద అయిందో చెప్పాలని ప్రశ్నించారు. ఏజెన్సీ నిర్వాహకులు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో ఇలా అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆహార నాణ్యత ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అరుణ్ కుమార్, రెవెన్యూ,విద్యాశాఖల అధికారులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు దేవి

‘స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర’లో ప్రతి ఉద్యోగి పాల్గొనాలి

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధం
- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఈ నెల 15న మూడో శనివారం నిర్వహించే శుభ్రత కార్యక్రమాలపై గురువారం కార్యాలయ సమావేశమందిరంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పార్కులు వంటి ప్రదేశాలలో పరిసరాల పరిశుభ్రత చేపట్టాలన్నారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది బహిరంగ ప్రదేశాల్లో శుభ్రతా కార్యక్రమాలు చేపట్టాలని, అందులో ప్రజలను, విద్యార్థులను భాగస్వాములను చేసుకోవాలని సూచించారు. ప్రతి శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం, మూడో శనివారం ప్రభుత్వం నిర్దేశించిన థీంతో కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించడం జరిగిందని, దాని అమ్మకాలు, కొనుగోలుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినియోగదారులు రీయూజ్ కవర్లు, సంచులు వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచాలని, అవసరమైన మరమ్మతులు నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మొక్కలు నాటాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రజలకు పరిశుభ్రమైన మంచినీరు ఏర్పాటు చేయాలని, పరిసరాలను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సుందరీకరణలో భాగంగా వంతెనలు, భవనాలపై సృజనాత్మక పెయింటిగులు వేయించాలని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

స్వచ్ఛ అవార్డులు...

మంచి పనితీరు కనబరిచిన స్వచ్ఛ వార్డు, స్వచ్ఛ పాఠశాల, స్వచ్ఛ అపార్ట్‌మెంట్, స్వచ్ఛ కళాశాల, స్వచ్ఛ బస్టాండ్, రైల్వే స్టేషన్లను గుర్తించి అవార్డులు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యకమానికి సంబంధించి ప్రతి జిల్లా కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకుని పర్యవేక్షణ చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, జిల్లా గణాంకాధికారి జి.రామారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ కె. శచీదేవి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ ఇ.నాగలక్ష్మి, జిల్లా ప్రజా రవాణా అధికారి కె.పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి, డ్వామా పీడీ బి.పూర్ణమాదేవి పాల్గొన్నారు.

బడిలో బలవంతపు తీర్మానాలు

- తుదిదశకు స్కూళ్ల పునర్నిర్మాణం ప్రక్రియ
- ప్రభుత్వ నిర్ణయానికి విశాఖలో 40.45 శాతం వ్యతిరేకత
- అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 85 శాతం ఓకేనట
- మూతపడనున్న ప్రాథమిక పాఠశాలలు
- అన్ని వర్గాల నుంచి తీవ్ర ఆందోళన

విశాఖ విద్య : ప్రభుత్వ పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ తుది దశకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన 117 జీవోను రద్దు చేసి దానికి ప్రత్యామ్నాయంగా మోడల్ స్కూళ్లను తెరపైకి తీసుకొచ్చింది. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసి, చుట్టు పక్కల పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఇందులో విలీనం చేసేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో దూరంగా వెళ్లే విద్యార్థులకు రవాణా ఛార్జీలు ఇస్తామని ప్రభుత్వం మభ్యపెడుతోంది. ప్రాథమిక విద్యకు విఘాతం కలిగేలా కూటమి ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయంపై విద్యావేత్తలు, ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ప్రజాభిప్రాయ సేకరణ పేరిట స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఆమోదం పొందాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ క్షేత్రస్థాయిలో ఇది పారదర్శకంగా జరగడం లేదు. పాఠశాలల పునర్నిర్మాణంపై వ్యతిరేకత లేకుండా చూడాలనే కూటమి ప్రభుత్వం మౌఖిక ఆదేశాలతో దీనిపై నేరుగా జిల్లా కలెక్టర్లు రంగంలోకి దిగారు. దీంతో బడిలో బలవంతపు తీర్మానాలు జరిగిపోతున్నాయి.

పాఠశాలల పునర్నిర్మాణం ఇలా..

పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా ఇక నుంచి శాటిలైట్ స్కూళ్లు (పీపీ-1, పీపీ-2), ఫౌండేషన్ స్కూళ్లు (పీపీ-1, పీపీ-2, అలాగే 1, 2 తరగతులు), మోడల్ ప్రైమరీ స్కూళ్లు (పీపీ-1, పీపీ-2, అలాగే 1 నుంచి 5వ తరగతి వరకు), హైస్కూళ్లు (6 నుంచి 10 వరకు) ఉండేలా కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి, చుట్టుపక్కల పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను దానిలోకి తరలిస్తారు. 60 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నట్లయితే దాన్ని యథావిధిగా కొనసాగిస్తారు. మిగతా స్కూళ్లలో కేవలం 1, 2 తరగతులు మాత్రమే నిర్వహించనున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు పూర్తిగా కనుమరుగైపోతాయి.

గ్రామీణ ప్రాంతాల్లో విలీనానికి సై అంటున్నారా..?

కూటమి ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలకు మేలు చేకూర్చేలా నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ ఏడాది ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోయాయి. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు ఇంకా తగ్గిపోతాయని ఉపాధ్యాయులు బాహాటంగానే చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రస్తుత నిర్ణయాలతో చాలా స్కూళ్లలో 1, 2 తరగతుల నిర్వహణకు విద్యార్థులు లేక, స్కూళ్లకు తాళాలు వేయాల్సిందే. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో చాలా పాఠశాలలు మూతపడనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల నుంచి ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా తీర్మానాలు వస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. భవిష్యత్‌లో తమ బడి మూతపడుతుందనే విషయం వారికి తెలిసే, ఇదంతా జరుగుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



జిల్లాలో మూతపడనున్న చీడికాడ మండలంలోని కట్టువాని అగ్రహారం ప్రాథమిక పాఠశాల

మిగులు ఉపాధ్యాయుల దారెటో..

ప్రాథమిక పాఠశాలల్లో ఇప్పటి వరకు ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు (ఎస్జీటీ) పనిచేస్తున్నారు. విశాఖపట్నంలో 783 మంది, అనకాపల్లిలో 2,114 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,566 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. 3, 4, 5 తరగతులను మోడల్ స్కూళ్లకు తరలించినట్లయితే, ఆయా పాఠశాలల్లో ఇక ఒక్కరే ఉపాధ్యాయుడు పనిచేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన మూడు జిల్లాల్లో కలిపి ఆరు వందలకు పైగానే ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌గా ఉంటారు. రేషనలైజేషన్ పేరుతో వీరిలో ఎక్కువ మందిని అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి పంపించాల్సి ఉంటుంది. 117 జీవో అమల్లో భాగంగా జరిగిన రేషనలైజేషన్‌తో ఏజెన్సీకి వెళ్లిన ఉపాధ్యాయులు ఇప్పట్లో వెనక్కి వచ్చే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపడుతున్న చర్యలతో మిగులు ఉపాధ్యాయులు దారెటనేది ప్రశ్నార్థకమే.

స్కూళ్ల పునర్నిర్మాణంపై అభిప్రాయ సేకరణ ఇలా..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	ప్రభుత్వ స్కూళ్లు	అభిప్రాయ సేకరణ పూర్తయిన స్కూళ్లు	అభిప్రాయ సేకరణలో ఆమోదం శాతం
విశాఖపట్నం	11	161	560	440	81.63
అనకాపల్లి	24	667	1,408	1,159	84.85
అల్లూరి	22	421	1,673	1,587	98.02

మోడల్ స్కూళ్లపై అభిప్రాయ సేకరణ ఇలా..

జిల్లా	ప్రతిపాదిత మోడల్ స్కూళ్లు	ఎస్ఎంసీల నుంచి వచ్చిన వ్యతిరేకత శాతం
విశాఖపట్నం	178	40.45
అనకాపల్లి	180	15.53
అల్లూరి	252	15.88

టీడీపీ, జనసేన డిష్యుం డిష్యుం

- చేనుల అగ్రహారంలో ఒకరిపై ఒకరు పిడిగుద్దులు
- తీవ్ర గాయాలపాలైన ఎంపీటీసీ భర్త నరసింగరావు

తుమ్మపాల : మండలంలో కొండుపాలెం పంచాయతీ చేనుల అగ్రహారం గ్రామంలో ఈ నెల 9న జరిగిన గ్రామ దేవత శ్రీ సత్తెమ్మ తల్లి జాతరలో మొదలైన ఫ్లెక్సీల వివాదం తీవ్రతరమై టీడీపీ వర్సస్ జనసేనగా మారింది. ఆ రోజు ఉదయం ఫ్లెక్సీల చించివేతతో మొదలైన ఘర్షణ సాయంత్రానికి ఒకరిపై మరొకరు కాపుకాచి దాడులు చేసుకునేంతగా ముదిరిపోయింది. టీడీపీ ఎంపీటీసీ భర్త మధుపాడ నరసింగరావు, జనసేన పార్టీ నేత, మాజీ సర్పంచ్ మధుపాడ శ్రీనివాసరావు, వారి కుటుంబసభ్యులు తీవ్రంగా కొట్టుకున్నారు. గాయాలపాలైన ఇరు వర్గాలు స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. మధుపాడ నరసింగరావును మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఇరువురికీ న్యాయం చేయలేక జనసేనకు చెందిన శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ నేతగా తప్పుడు ప్రకటన చేయడంతో అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. కాగా ఇరువర్గాలను పోలీసులు విచారించారు. ఎటువంటి చర్యలు తీసుకున్నారో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసింగరావు, ఆయన కుమారులు

పలు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు స్టేషన్ల నుంచి ఆయా తేదీల్లో పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. వివరాలివి.

- చర్లపల్లి-నహర్‌లగున్(07046) స్పెషల్ ఈ నెల 15, 22, 29వ తేదీల్లో (ఆదివారం) చర్లపల్లిలో ఉదయం 8.40 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9.13 గంటలకు దువ్వాడకు, సోమవారం సాయంత్రం 4గంటలకు నహర్‌లగున్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నహర్‌లగున్-చర్లపల్లి(07047) స్పెషల్ ఈ నెల 18, 25, ఏప్రిల్ 1వ తేదీల్లో (మంగళవారం) నహర్‌లగున్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు బయల్దేరి గురువారం ఉదయం 6.20 గంటలకు దువ్వాడకు అదేరోజు రాత్రి 9.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.
- విశాఖపట్నం-షాలిమర్(08577) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16వ తేదీ ఉదయం 11.20 గంటలకు విశాఖలో బయల్దేరి మరుసటిరోజు(బుధవారం) తెల్లవారు 3 గంటలకు షాలిమర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో షాలిమర్- విశాఖపట్నం(08578) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ ఉదయం 5 గంటలకు షాలిమర్‌లో బయల్దేరి అదే రోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది.
- విశాఖపట్నం-చర్లపల్లి(08579) స్పెషల్ ఈ నెల 16వ తేదీ రాత్రి 6.20 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చర్లపల్లి-విశాఖపట్నం(08580) స్పెషల్ ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి అదే రోజు రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

క్లుప్తంగా

ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై చర్యలు

అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు



న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు

మాడుగుల: ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారితో పాటు వారికి సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని అనకాపల్లి ప్రధాన సివిల్ జడ్జి ధర్మారావు అన్నారు. గురువారం స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. గుడ్ టచ్-బాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా పిల్లల పట్ల చెడుగా ప్రవర్తిస్తే వెంటనే టీచర్లకు గానీ, తల్లిదండ్రులకు గానీ తెలియజేయాలన్నారు. పిల్లలు సోషల్ మీడియాకు, మొబైళ్లకు దూరంగా ఉండాలన్నారు. సీనియర్ న్యాయవాది శ్రీనాదు ప్రసాదరావు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు చేసే పనుల్లో నిమగ్నమైతే వారికి తల్లిదండ్రులు కష్టసుఖాలు తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ ఎస్‌వో విజయ, ఉపాధ్యాయినిలు, విద్యార్థినులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్, డ్రైవర్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

అనకాపల్లి టౌన్ : స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కండక్టర్, డ్రైవర్లపై సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలని ఎన్ఎంయూఏ జోనల్ జాయింట్ సెక్రటరీ జి. శంకరావు డిమాండ్ చేశారు. 13వ రోజు రిలే నిరాహార దీక్షలో భాగంగా గురువారం భోజన విరామ సమయంలో కార్మికులు, ఆర్టీసీ డిపో ముందు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జోనల్ అధ్యక్షుడు ఏఎస్ రావు, కార్యదర్శి కె.ఎన్ .వి.రమేష్, రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్, కె.సునీత, ఎన్.లక్ష్మి, పీఆర్ లక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.

వృద్ధుడి మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

చోడవరం: వృద్ధుడి మృతికి కారకుడైన నేమాల హరిని అరెస్టు చేసినట్టు చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు గురువారం తెలిపారు. చోడవరం బాలాజీనగర్‌కు చెందిన ఇందల సన్యాశిరావు అనే వృద్ధుడిని ఇదే ప్రాంతానికి చెందిన నేమాల హరి ఈనెల 4వ తేదీన ఘర్షణ పడి కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. తలకు బలమైన గాయమైన సన్యాసిరావును చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12వ తేదీన మృతి చెందాడు. వృద్ధుడి మృతికి కారణమైన హరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.



సదస్యంలో భాగంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



తుని మహిళా బృందం కోలాట దృశ్యం

నేత్రపర్వం.. వెంకన్న తోట ఉత్సవం

- ఉభయనాంచారులతో కోనేటి రాయుడి విహారం
- వందలాదిగా తరలి వచ్చిన భక్తులు

నక్కపల్లి : వార్షిక కల్యాణం అనంతరం ఉభయ నాంచారులతో కూడిన వైకుంఠనాథుని వన విహార యాత్ర (తోట ఉత్సవం) గురువారం నేత్రపర్వంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని భక్తులు స్వామివారి హనీమూన్‌గా చెప్పుకుంటుంటారు. ప్రతి ఏటా వార్షిక కల్యాణం అనంతరం స్వామివారి తోట ఉత్సవం నిర్వహిస్తారు. ఉపమాక శివారు సారిపల్లిపాలెం సమీపంలో గల తోటలో ఉన్న మండపం వద్ద ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు జి.వరప్రసాద్ ఘనంగా నిర్వహించారు. రాజాధిరాజ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వర స్వామిని కొలువుదీర్చి మండపం వద్దకు తీసుకొచ్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపశుద్ధి, ప్రసాద నివేదన, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంకాల ఆరాధనలో భాగంగా ఆలయంలో విశేష హోమాలు జరిగాయి. వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం అనంతరం నాలుగవ రోజున ఈ వన విహార యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం రాత్రి స్వామివారి తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారి వనవిహార యాత్ర (తోట ఉత్సవాన్ని) తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల వారు తరలివచ్చారు. ఉత్సవానికి వెళ్తున్న స్వామి వెంట వందలాది మంది భక్తులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు



స్వామివారిని తోట ఉత్సవానికి తోడ్కొని వెళ్తున్న అర్చకులు

గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, ఆలయ అర్చకులు సంకర్షణపల్లి కష్ణమాచార్యులు, శేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు, గోపాలాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా సదస్యం..

కల్యాణోత్సవాల్లో బాగంగా సదస్యం (పండిత సభ) ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కల్యాణ వేదిక వద్ద స్వామివారి ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. ప్రముఖ వేద పండితురాలు డాక్టర్ గాయత్రీదేవి స్వామివారి కల్యాణం నిర్వహించడం ద్వారా లోకంలో ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు. పండితులంతా పురాణాలను ఔపోసన పట్టి స్వామివారికి నిర్వహించే కార్యక్రమాలను, కైంకర్యాలను సేవల గురించి మనకు తెలియజేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవాల్లో స్వామివారి సేవల్లో తరించిన పలువురు పండితులను సత్కరించారు. అనంతరం పుణ్యకోటి వాహనంపై ఉభయ నాంచారులతో కూడిన స్వామి వారిని కొలువుదీర్చి తిరువీధి సేవ నిర్వహించారు.

అలరిస్తున్న కోలాటాలు..

వెంకన్న కల్యాణోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బృందాలు కోలాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. గురువారం తుని పట్టణానికి చెందిన కోలాట బృందం చేసిన కార్యక్రమం భక్తులను అలరించింది. ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతం నుంచి వచ్చిన బృందాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. టీటీడీ వారి ఆధ్వర్యంలో కూడా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

కల్తీ మద్యాన్ని అరికట్టరేం?

- కొత్త మద్యం పాలసీ వచ్చాక విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు
- కల్తీ మద్యంతోనే అనారోగ్యం పాలు
- నవోదయం 2.0 సదస్సులో ఎక్సైజ్ అధికారులను నిలదీసిన మత్స్యకారులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సర్పంచ్ లోవరాజు

ఎస్.రాయవరం: మండలంలో మత్స్యకార గ్రామాల్లో కల్తీ మద్యం ఏరులై పారుతోందని గ్రామస్తులు ఎక్సైజ్ పోలీసులకు ముక్తకంఠంతో తెలిపారు. పాయకరావుపేట ఎక్సైజ్ పోలీసులు రేవుపోలవరం, బంగారమ్మపాలెం గ్రామాల్లో గురువారం నవోదయం -2.0 అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా తయారీ, గంజాయి రవాణా, అమ్మకాలు చట్టరీత్యా నేరం అని చెప్పారు. సారా, గంజాయి సేవించడం వల్ల గుండె జబ్బులు, నోరు, లివర్, ప్రేగు క్యాన్సర్ కడుపులో మంట వంటి జబ్బులు వస్తాయని తెలిపారు. ఇది విన్న గ్రామస్తులు ఎక్సైజ్ పోలీసులను ఎదురు ప్రశ్నించడం మొదలు పెట్టారు. అయిదు వేల నుంచి 10 వేల జనాభా ఉండే మా గ్రామాల్లో కల్తీమద్యం పెద్ద ఎత్తున విక్రయిస్తుంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.ఎవరైనా తెగించి ఫిర్యాదు చేస్తే వారిళ్లపైకి అక్రమ మద్యం అమ్మేవారు దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వంలోనే నయం..

గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉండేదని, దానిద్వారా నాణ్యమైన మద్యం సరఫరా అయ్యేదని, ఇప్పుడు దుకాణం తొలగించి గుడివాడకు మార్చి బెల్టు దుకాణాలకు తెర తీశారన్నారు. గ్రామంలో సుమారు 100కు పైగా మద్యం బెల్టు దుకాణాలు ఉన్నాయని ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేరుగా లైసెన్స్ దుకాణాల సిబ్బంది ప్రతి రోజూ ఇంటింటికీ పంచినట్టు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం సరఫరా చేసి వెళ్తున్నారని చెప్పారు. అలా పంపిణీ చేసి విక్రయిస్తున్న మద్యం పూర్తి కల్తీగా ఉంటుందని, అది తాగి పలువురు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. గ్రామంలో ప్రభుత్వ అనుమతితో కూడిన మద్యం దుకాణం మాత్రమే ఏర్పాటు చేయాలని, అక్రమ మద్యాన్ని అరికట్టాలని అన్నారు. ఇదే పరిస్థితి బంగారమ్మపాలెంలోనూ ఉందని, ఎక్సైజ్ పోలీసులు, సివిల్ పోలీసులు ఎవరికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వాపోయారు. దీంతో గ్రామస్తుల ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఎక్సైజ్ పోలీసులు వారికి తెలిపారు. సమావేశంలో సర్పంచ్ మల్లే లోవరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, గ్రామస్తులు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో

ఆటో డ్రైవర్ మృతి

చోడవరం : వెంకన్నపాలెం-సబ్బవరం రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి చెందాడు. రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఆటో ఢీకొట్టిన ఘటనలో ఆటోడ్రైవర్ డి.నర్సింగరావు (54) అక్కడికక్కడే మృతిచెందాడు. సబ్బవరం మండలం ఆరిపాక గ్రామానికి చెందిన నర్సింగరావు తన ఆటోతో బుధవారం రాత్రి వెంకన్నపాలెం వైపు వస్తుండగా చోడవరం మండలం అడ్డూరు గ్రామ సమీపంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.



ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఆటో డ్రైవర్ నర్సింగరావు

మొల్లమాంబ స్ఫూర్తిగా ప్రతి మహిళ చదువుకోవాలి

తుమ్మపాల : కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి మహిళ చదువుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొల్లమాంబ జయంతి వేడుకల్లో మొల్లమాంబ చిత్రపటానికి ఆమె పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో మహిళలను విద్యకు దూరం చేశారనే భావనను చెరిపేస్తూ 14వ శతాబ్దంలోనే కవయిత్రి మొల్ల సంస్కృతం అభ్యసించారన్నారు. మహిళా దినోత్సవం జరుపుకొన్న కొద్దిరోజులలోనే మహనీయురాలు మొల్లమాంబ జయంతి జరుపుకోవడం, ఆమెను గురించి తెలుసుకోవడం అదృష్టమన్నారు. సంస్కృతంలో గల రామాయణాన్ని తెలుగువారి కోరిక మేరకు తెలుగులోనికి అనువదించడంతో మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. కవయిత్రి మొల్లమాంబ చదువుకుని తను కోరిన విధంగా జీవించారని, ప్రతి మహిళ ఆమెను స్ఫూర్తిగా తీసుకుని చక్కగా చదువుకోవాలని, కోరుకున్న ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. కుటుంబంలో ఆడపిల్లలకు వారి కలలు తీర్చుకునే అవకాశం, నచ్చిన రంగాన్ని ఎన్నుకుని రాణించే అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర గవర



కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

నలో తెలిపారు. ఇందుకు సమీపంలోని ఎంప్యానెల్డ్ అస్పత్రిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్వీయ

సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎం.సురేంద్ర మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కుమ్మరి కులంలో పుట్టి సంస్కృతం చదువుకుని రామాయణాన్ని తెలుగులో రచించి కుమ్మరి కులానికే గౌరవం తీసుకువచ్చారన్నారు. అటువంటి మహనీయురాలి చరిత్రను భావితరాలకు తెలియజేయాలన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కుమ్మరి, శాలివాహన సంఘ సభ్యులు అప్పలకొండ, సత్యనారాయణ మొల్లమాంబ జీవిత చరిత్ర గురించి తెలియజేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి, బీసీ సంక్షేమశాఖ వసతిగృహ అధికారులు, సంఘ సభ్యులు కె.గుండప్ప, సిహెచ్. దుర్గాప్రసాద్, ఎస్.అప్పారావు, కె.శేషగిరిరావు, డి.అప్పలరాజు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులతో కలెక్టర్ సమీక్ష

తుమ్మపాల : జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుండి ఏప్రిల్ 1వరకు 107 సెంటర్లలో నిర్వహిస్తున్న పదవతరగతి పరీక్షలకు 22వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

మౌలిక సదుపాయాలు, రవాణా ఏర్పాట్లు

పరీక్ష కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగా చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, పరీక్ష కేంద్రాలకు దగ్గరలోని జెరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివేయాలన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

పరీక్ష పత్రాలకు, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణ తనిఖీ చేయుటకు సిట్టింగు, ఫ్లయింగు స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిల్స్ సకాలంలో తరలించడానికి పరీక్షల నిర్వహణ అధికారులకు తపాలా శాఖ సిబ్బంది సహకరించాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఆయా శాఖలకు కేటాయించిన పనులను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎక్కడా మాస్ కాపీయింగు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు, పర్యవేక్షణ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల సహాయ కమిషనర్ శ్రీధర్ రెడ్డి, వైద్యశాఖ, పోలీసు, ఎలక్ట్రికల్, తపాలా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కార్డుకు నమోదు చేసుకోండి

ఏయూ క్యాంపస్: పీఎం జన్ ఆరోగ్య యోజన విస్తరణలో భాగంగా 70 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వయో వృద్ధులు ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలు పొందేందుకు ఆయుష్మాన్ వయో వందన కార్డును పొందవచ్చని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సమీపంలోని ఎంప్యానెల్డ్ అస్పత్రిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్వీయ రిజిస్ట్రేషన్ కోసం ఆయుష్మాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దీంతో పాటు www.beneficiary.nha.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. సమాచారం, మరిన్ని వివరాలకు కోసం టోల్ ఫ్రీ నంబర్ 14555కు ఫోన్ చేసి, 1800110770 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి తెలుసుకోవచ్చన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్ఎస్), మాజీ సైనికుల సహకార ఆరోగ్య పథకం(ఈసీహెచ్ఎస్), ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్(సీఏపీఎఫ్) వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్న సీనియర్ సిటిజన్లు, వారి ప్రస్తుత పథకం, లేదా ఆయుష్మాన్ భారత్ పీఎం జన్ ఆరోగ్య యోజనను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ప్రైవేట్ ఆరోగ్య బీమా కవరేజీ పరిధిలోకి వచ్చే వ్యక్తులు, ఉద్యోగులు, రాష్ట్ర బీమా పథకం సభ్యులు కూడా ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

మూడు రోజుల్లో స్టాఫ్ నర్సుల తుది జాబితా

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీలో భాగంగా అభ్యర్థుల దరఖాస్తులపై వడపోత కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం చేపట్టింది. ఉత్తరాంధ్ర పరిధిలోని 6 జిల్లాల్లో 106 పోస్టులకు 8,300 మంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. జనవరి 27న అభ్యర్థుల ప్రావిజనల్ జాబితా విడుదల చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జాబితా పరిశీలన నిలిచిపోయింది. అభ్యర్థుల ప్రావిజనల్ జాబితా మీద 1,570 అభ్యంతరాలు వచ్చాయి. వీటితోపాటు అభ్యర్థుల దరఖాస్తుల్ని అన్ని విధాలా పరిశీలించి మూడు రోజుల్లో ప్రావిజనల్ ఎంపిక జాబితాను విడుదల చేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి సాక్షికి గురువారం తెలిపారు. ఈ జాబితాపై కూడా అభ్యంతరాలకు మూడు రోజులు గడువిస్తామన్నారు. వాటిని పరిశీలించాకే తుది ఎంపిక జాబితాను రోస్టర్ మేరకు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- చివరి తేదీ ఏప్రిల్ 15
- ప్రవేశపరీక్ష ఏప్రిల్ 30

మురళీనగర్: పదో తరగతి అనంతరం సాంకేతిక విద్యను అభ్యసించాలనుకుంటున్న విద్యార్థుల కోసం పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు పాలిసెట్-2025 నోటిఫికేషన్‌ను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జి.గణేష్ కుమార్ విడుదల చేశారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు, ప్రస్తుతం పరీక్షలు రాస్తున్న వారు పాలిసెట్ రాయడానికి అర్హులని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ గురువారం ప్రారంభమైందని, ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు https://polycetap.nic.in/ను సందర్శించాలన్నారు. దరఖాస్తు ప్రక్రియలో ఏమైనా సందేహాలు ఉంటే.. పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. హెల్ప్‌లైన్ కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

గుర్తింపు కార్డులివ్వాలంటూ డప్పు కళాకారుల ర్యాలీ



డప్పు కళాకారులతో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి

రోలుగుంట: తమకు గుర్తింపుకార్డులు ఇవ్వాలంటూ రోలుగుంటలో గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కులవ్యతిరేక పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి పలు సమస్యలపై మాట్లాడారు. నిరుపేదలైన డప్పు కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలన్నారు. అలాగే చర్మకారులకు రూ. 6000 పింఛన్ ఇవ్వాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. డప్పు కళాకారులకు గజ్జెల డ్రెస్ ఇవ్వడమే కాకుండా కుట్టు కూలి కూడా ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల డప్పు కళాకారులు పాల్గొన్నారు.

1 నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

మురళీనగర్: పాలిసెట్-2025కు హాజరయ్యే విద్యార్థులకు సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఓ ప్రకటన విడుదల చేశారు. సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 10వ తరగతి పాసైన వారితో పాటు ప్రస్తుతం పది పరీక్షలు రాసే విద్యార్థులు చేరవచ్చని చెప్పారు. శిక్షణ కోసం ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

డీఎస్సీ కోచింగ్‌కు వెబ్ ఆప్షన్లు

- 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలి

ఎంవీపీకాలనీ: డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ఎంపికైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ లోపు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సూచించింది. ఈ మేరకు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. షార్ట్‌లిస్ట్ ద్వారా ఎంపికైన అభ్యర్థులు డీఎస్సీ కోచింగ్ అందిస్తున్న సంస్థలను ఈ వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవాలన్నారు. అభ్యర్థులు వారి ప్రాధాన్యతల ప్రకారం అన్ని కోచింగ్ సంస్థలకు https://jnanabhumi.ap.gov.in/ పోర్టల్ ద్వారా వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని సూచించారు.

సన్యాసిరాజుపాలెంలో చోరీ



మంచంపై చెల్లాచెదురుగా ఉన్న దుస్తులు



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

కోటవురట్ల: ఆ దొంగ మంచి దొంగ.. ఎందుకంటే బీరువాలో పెద్ద మొత్తంలో నగదు ఉన్నప్పటికీ తనకు కావలసిన కొంత నగదు, బంగారాన్ని మాత్రమే కాజేసి జాలి చూపించాడు. పోలీసులు సైతం విస్తుపోయిన ఈ ఘటన రామచంద్రపాలెం శివారు సన్యాసిరాజుపాలెంలో గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం.. సన్యాసిరాజుపాలేనికి చెందిన శింగంపల్లి వరలక్ష్మి, కొండబాబు దంపతులు ఊరి చివర ఇల్లు కట్టుకుని అందులో నివసిస్తున్నారు. కొడుకు లంకెలపాలెంలో చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. వరలక్ష్మి, కొండబాబు దంపతులు ఊళ్లో పని చేసుకుంటూ ఉంటారు. గత నెల 26వ తేదీన ఊళ్లో కొందరితో కలిసి ఉపాధి నిమిత్తం పడమటకు పని కోసం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని గురువారం ఉదయం ఇంటికి తిరిగొచ్చారు. ఇంటి తలుపుకు వేసిన తాళం కప్ప ఉన్నదున్నట్టుగా ఉండగానే గెడ మాత్రం తప్పించి ఉండడాన్ని గమనించి ఆందోళనగా ఇంట్లోకి వెళ్లారు. ఇంట్లో బీరువా కూడా గెడ తప్పించి ఉండడం గుర్తించి వెంటనే నగదు, బంగారం కోసం వెతికారు. ఇంటి స్థలం కొనుగోలు కోసం దాచి ఉంచిన రూ.5 లక్షల్లో రూ.2.50 లక్షలు, 18 గ్రాముల బంగారు ఆభరణాలకు గాను 6 గ్రాముల చెవిదిద్దులు కనిపించలేదు. దాంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తీసుకుని కేసు నమోదు చేశారు. క్లూస్ టీం చేరుకుని ఆధారాల కోసం ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై జరిగిన దొంగతనంపై ఆశ్చర్యపోయారు. ఎవరో తెలిసిన వాళ్లే ఈ పని చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పూడిమడక వైన్ షాప్‌లో చోరీ



చోరీ జరిగిన పూడిమడక గంటాలమ్మ వైన్ షాపు



వైన్ షాపులో సీసీ కెమెరా లైట్లు బంద్ చేస్తున్న దొంగ

అచ్యుతాపురం రూరల్ : మత్స్యకార గ్రామమైన పూడిమడక గంటాలమ్మ వైన్ షాపులో బుధవారం అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో రూ.2 లక్షల 70 వేలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షాపులో ఏ వస్తువు ఎక్కడ ఉందో తెలిసిన వ్యక్తే దీనికి పాల్పడి ఉంటాడని అంచనా వేస్తున్నారు. చోరీ చేసిన వ్యక్తి ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఉంటాయో గమనించి మొదట వాటిపై దృష్టి సారించి, ఆపై దర్జాగా దొంగతనం చేశాడు. పోలీసులు, క్లూస్ టీమ్ ద్వారా అన్వేషించినప్పటికీ ఏమాత్రం ఉపయోగం లేకపోయిందన్నారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి చేతికి గ్లౌజ్‌లు, ముఖానికి మంకీ క్యాప్, కాలికి షూస్ వేసుకుని ఎటువంటి ఆధారాలు దొరక్కుండా జాగ్రత్త వహించాడు. క్యాష్ కౌంటర్‌కు తాళాలు, భద్రత లేకుండా అంత మొత్తం ఉంచడంపై పోలీసులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వంలో వైన్ షాపులు సిండికేట్లుగా ఏర్పడి వ్యాపారాలు చేసినప్పుడు ఇటువంటి సంఘటనలు జరిగాయని ప్రజలు గుర్తు చేసుకున్నారు. స్థానిక సీఐ నమ్మి గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

కశింకోట: మండలంలోని బయ్యవరం హైస్కూలులో గురువారం టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. డ్యాన్సులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అలరించారు. ఈ సందర్భంగా జి.వి. రమణ మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉన్నత విద్యలు చదివి అత్యున్నత స్థానాలకు ఎదగాలన్నారు. తద్వారా తల్లిదండ్రులు, పాఠశాల, గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలన్నారు. ఉపాధ్యాయులు సిహెచ్. జేసుదాసు, ఎస్. రమేష్, ఎ. సరోజిని, ఈ. వెంకటలక్ష్మి, ఎం. రామునాయుడు, పుష్పలత, ఎస్. నాగేశ్వరరావు, ఎ. ప్రసాద్, జి. రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలన


అంగన్‌వాడీ పిల్లలతో ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి

అనకాపల్లి టౌన్: మండలంలోని ముత్రాస్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ జి. దేవి గురువారం పరిశీలించారు. ఇక్కడ చిన్నారులకు అందించే పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా మాట్లాడి పలు విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. అనంతలక్ష్మి, ఏసీడీపీవో టి. శశికళ, డీఎస్‌వో, ఎంఈవో, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

32 మద్యం సీసాలు స్వాధీనం


పట్టుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ పోలీసులు

కశింకోట: మండలంలోని తేగాడలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి, 32 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని అనకాపల్లి ఎక్సైజ్ సీఐ వైఎల్ నాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎన్. కన్నాజీరావు(32)ను పట్టుకుని అరెస్టు చేశామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 6,098 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,810	4,620
మొదటి రకం	3,600	4.140
రెండో రకం	3,240	3,790
మూడో రకం	3,070	3,230

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	:రాజా
ఆఫీసర్ ఆన్ డ్యూటీ	:సత్యనారాయణ స్క్రీన్-1
యుగానికి ఒక్కడు	:సత్యనారాయణ స్క్రీన్-2
కోర్ట్	:పర్తిసాయి
దిల్‌రూబా	:షిర్డీసాయి
థౌజండ్ వాలా	:వెంకటేశ్వర(ఉదయం)
న్యూ పోలీస్ స్టోరీ	:వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు)
తండేల్	:శ్రీసత్య
ఛావా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 57 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 382 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 349 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో..



వైఎస్సార్‌సీపీ హయాంలో తంతనుగా కొత్త పింఛన్లు

వైఎస్సార్‌సీపీ పాలనలో కొత్త పింఛన్లు కావాలంటే వలంటీర్లు అర్హులైన లబ్ధిదారులను తక్షణమే గుర్తించేవారు. దరఖాస్తుదారులు సచివాలయాలకు వెళ్లకుండానే ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేసేవారు. ఇది నిరంతర ప్రక్రియగా జరిగేది. పింఛన్దారులకు రేషన్ కార్డు తప్పనిసరిగా జత చేయాలనే నిబంధన ఉండటంతో దీన్ని ఎప్పటికప్పుడు జారీ చేసేవారు. కూటమి పాలనలో ఈ ప్రక్రియం తా నిలిచిపోయింది. కనీసం రేషన్ కార్డులు జారీ చేసిన పాపానపో లేదు.

అనకాపల్లి: వృద్ధులు, దివ్యాంగులు, అచేతన రోగులు కొత్త పింఛన్ల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

కూటమి అధికారం చేపట్టి తొమ్మిది మాసాలు దాటినప్పటికీ ఇంతవరకూ వీటిని మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. వీటికితోడు 50 ఏళ్ల వయసు గల బీసీలకు సూపర్ సిక్స్ పథకం కింద పింఛన్లు ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి పాలకులు ఇప్పుడు ఊసెత్తడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం దరఖాస్తులు చేసుకుందామని సచివాలయాలు, జోనల్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాయాలకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంకా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడం లేదని తిప్పి పంపుతు న్నారని వాపోతున్నారు.

రోగులు ఎదురుచూపులు..

గతేడాది జూన్ 12న కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికీ తొమ్మిది నెలలు దాటింది. నేటికీ కొత్త పింఛన్లపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కొత్త పింఛన్లు తీసుకునేందుకు 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, మెడికల్ సమస్యతో బాధపడుతున్న రోగులు ఎదురుచూస్తున్నారు. నేటి వరకూ అనకాపల్లి జోనల్ పరిధిలో 10,126, మండలంలో 13,367 మందికి అన్ని రకాల పింఛన్లు పాత పద్ధతిలోనే అందజేయగా, కొత్తగా మరిన్ని పెరిగే అవకాశాలు ఉన్నాయి.

50 ఏళ్ల బీసీలకు పింఛన్లు ఏవీ....

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకం కింద 50 సంవత్సరాలు దాటిన వారందరికి ప్రభుత్వ పింఛన్లు నెలకు రూ.4వేలు అందజేస్తామని హామీ ఇచ్చింది. దీనిపై ఇంత వరకూ ఎటువంటి కదలిక లేకుండా పోయింది. 60 సంవత్సరాలపైబడిన వృద్ధులు, దివ్యాంగులకు కొత్త పింఛన్లు ఇవ్వలేదు. ఇక 50 సంవత్సరాలు నిండిన బీసీ వర్గాల ప్రజలకు ఇంకెప్పుడు ఇస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ఆదేశాలు రాలేదు

కొత్త పింఛన్లు మంజూరుకు సంబంధించిన ఆదేశాలు ప్రభుత్వం నుంచి ఏమి రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ప్రభుత్వానికి నివేదిస్తాం.
– నరసింహరావు, ఎంపీడీవో, అనకాపల్లి

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి



పింఛన్లు కావాలంటే రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది మాసాలు అవుతున్నప్పటికీ నేటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయం. నియోజకవర్గ పరిధిలో అన్ని వర్గాల పింఛన్లుదారులు వెయ్యి మంది వరకూ ఉంటారు. పాత పింఛన్‌దారులలో ఇప్పటికే కొంతమంది మృతి చెందారు. – గంటా శ్రీరామ్, సీపీఎం మండల కార్యదర్శి, అనకాపల్లి

డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం


డంపింగ్ యార్డుని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్: పట్టణ జీవీఎంసీ కార్యాలయం ఆవరణలో డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె. లోకనాథం డిమాండ్ చేశారు. పట్టణంలో వుడ్‌పేట, వేల్పుల వీధి, విజయరామరాజు పేట, బర్మాకాలనీ, లెపర్సీ కాలనీ, నెహ్రూ చౌక్ తదితర ప్రాంతాలలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఊరు చెత్తనంతా తీసుకువచ్చి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వేయడం దేశంలో ఎక్కడా లేదన్నారు. దీనివల్ల పట్టణమంతా దోమలతో నిండిపోయందన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలి ప్రజలకు వేలాది రూపాయలు ఖర్చవుతుందని వాపోయారు. పక్కనే ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలు విద్యార్థులు దీని బారిన పడుతున్నారన్నారు. పార్టీ మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూ విజయరామరాజు పేట రైల్వే ట్రాక్ పక్కన రోడ్డు వేయాలని లెపర్సీ కాలనీలో తాగునీరు రావడం లేదని, అక్కడి ప్రజలకు మంచినీటి ట్యాంక్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి. ఉమామహేశ్వరావు, అల్లు రాజు, ఎస్. వీరుయాదవ్, కాళ్ల తేలయ్యబాబు, పి. చలపతి, బి. నూక అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బోసిపోయిన వారపు సంత


కశింకోటలో సూర్య తాపంతో బోసిపోయిన వారపు సంత


వాహనాల రాకపోకలు తగ్గి వెలవెలబోయిన తాళ్లపాలెం కూడలి

కశింకోట: సంత సూర్య తాపంతో స్థానిక వారపు బోసిపోయింది. వేసవి తీవ్రత క్రమేపి పెరుగుతోంది. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఎండ తీవ్రత ఎక్కువైంది. అత్యవసరమైన వారు మినహా మిగిలిన వారు బయట తిరగని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజలు కొనుగోలు చేయడానికి రావడం తగ్గిపోయింది. ఇక ఎండ తీవ్రతతో మరో వైపు వ్యాపారులు ఎక్కువ మంది దుకాణాలు విడచి నీడ పట్టుకు వెళ్లారు. దీంతో సంత వెలవెలబోయింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎండ తీవ్రత తగ్గడంతో కొనుగోళ్లు, అమ్మకాలు ఊపందుకున్నాయి. ప్రజలు ముమ్మరంగా కూరగాయలు, ఆకుకూరలు, మసాల సరుకులు వగైరా జోరుగా కొనుగోలు చేశారు. ఎండ తీవ్రత వల్ల జాతీయ రహదారి వెలవెలబోయింది. వాహనాల రాకపోకల సంఖ్య తగ్గింది. తాళ్లపాలెం కూడలి వాహన సంచారం తగ్గి బోసిపోయింది. గూగుల్ ప్రకారం గరిష్ఠంగా 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఇక్కడ నమోదైంది. వేసవి ప్రారంభమైన మార్చిలోనే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే, ఇక ముందు మే నెలలో ఇంకెంత తీవ్రంగా ఉంటాయోనని ప్రజలు మదన పడుతున్నారు.

సింహాచలం బస్ స్టేషన్లో ఆర్ఎం తనిఖీలు


ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

సింహాచలం: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను గురువారం రాత్రి రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్లను పరిశీలించి, నిర్వహణపై ఆరా తీశారు. స్టాల్స్‌లో ప్లాస్టిక్ నిషేధాన్ని వ్యాపారులంతా పాటించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గుడ్డ, నారతో చేసిన సంచులను మాత్రమే వాడాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహారావు, అసిస్టెంట్ ఇంజినీర్ నాయుడు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చికిత్సకు ఆధార్ తప్పనిసరి..


సూపరింటెండెంట్ డాక్టరు ప్రసాద్

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇ-హాస్పిటల్ విధానంలో భాగంగా చికిత్స కోసం వచ్చే రోగులు కచ్చితంగా ఆధార్‌కార్డు లేదా ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్ నంబరు గల మొబైల్‌ను వెంట తీసుకురావాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త విధానంతో రోగులు ఓపీలో ఆధార్ నంబరును నమోదు చేయించాల్సి ఉంటుందన్నారు. ఈ విధానం వల్ల రోగులు ఏ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లినా వారి రోగం, చికిత్స వివరాలు తెలుస్తాయన్నారు. దాంతో రోగులు ప్రత్యేకంగా చికిత్సకు సంబంధించిన ఫైల్‌ను తీసుకెళ్లవలసిన అవసరం ఉండదన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వాస్పత్రికి వెళ్లినా ఆధార్ నంబర్‌తో కేసు వివరాలు తెలుస్తాయని తెలిపారు. ఎవరైతే చికిత్స పొందుతారో వారి ఆధార్ మాత్రమే ఉండాలని, లేదా అనుసంధానం చేసిన మొబైల్ నంబరు వెంట ఉండాలని సూచించారు.

రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం

దేవరాపల్లి: మండలంలోని గిరిజన పంచాయతీ వాలాబుకు సమీపంలోని కొండ ప్రాంతంలో గురువారం రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. చీడికాడ మండలం రెల్లలపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పోడు సాగు పనుల నిమిత్తం తమ ద్విచక్ర వాహనాలను రోజూ మాదిరిగా కొండ దిగువున పార్కింగ్ చేసి వెళ్లారు. పనులు ముగించుకొని వచ్చి చూడగా పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు బీడీ లేదా చుట్ట వెలిగించి పడేయడంతోనే మంటలు చెలరేగి ద్విచక్ర వాహనాలు దగ్ధమమై ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో బాధితులు బోరున విలపిస్తున్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన వేంకటేశ్వరుడు


గరుడ వాహనంపై వేంకటేశ్వర స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు


ఊరేగింపులో కోలాటం ప్రదర్శిస్తున్న భక్తజన బృందం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణ మహోత్సవంలో భాగంగా గురువారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. ముందుగా దేవాలయం ప్రధాన అర్చకులు పులకండం విజయబాబు, గిరిబాబుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గోవింద నామస్మరణతో గరుడ వాహనంపై స్వామి వారిని ఉంచి ఊరేగించారు. ఈ ఊరేగింపును ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో టి. రాజసులోచన ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య వాగ్దేయ వరదాయిని బృందాలు, మండపేట బ్యాండ్, తప్పెటగుళ్లు, సన్నాయి మేళాలు, చిడతలు, కోలాటం ప్రదర్శనల మధ్య పురవీధులలో ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో పులకండం ప్రసాద్ బాబు, రాజేష్, ధర్మకర్తలు గోలు మురళీ, సిహెచ్ నూకరాజు, వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ, కొణతాల వాసు, సోమాదుల తులసి, భక్తులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే చర్యలు

కశింకోట: సారా తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి ప్రోహిబిషన్ ఎక్సైజ్ సీఐ వై. లక్ష్మన్నాయుడు హెచ్చరించారు. మండలంలోని జమాదులపాలెం గ్రామంలో గురువారం రాత్రి నవోదయం-2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. సారాకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన అవగాహన కల్పించారు. సారా అరికట్టడానికి అంతా సహకరించాలన్నారు. స్థానికులు, నాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రోగ్రాం మేనేజర్ దుర్గాప్రసాద్

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులకు నిర్మాణ భారత్, టెక్ మహీంద్ర ఫౌండేషన్, స్మార్ట్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉపాధి, ఉద్యోగ కల్పనకు అవసరమైన సాఫ్ట్ స్కిల్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం మేనేజర్ దుర్గాప్రసాద్ వెలమల పాల్గొని సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహనతో పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలను వివరించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనీ మొబిలైజర్ దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ వీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు కార్మికులకు జీతాలు చెల్లించాలి


ఎస్‌టీబీఎల్ హోటల్‌లో తనిఖీలు చేస్తున్న కార్మిక శాఖ అధికారి సూర్యనారాయణ, తదితరులు

సబ్బవరం: కార్మిక చట్టం నిబంధనల మేరకు కార్మికులకు జీతాలను చెల్లించాలని చోడవరం సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ సంబంధిత యాజమాన్యాలకు సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో సబ్బవరంలోని పలు వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, సంస్థల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. తక్కువ జీతం చెల్లిస్తున్న యజమానుల నుంచి వ్యత్యాస జీతంపై క్లెయిం దాఖలు చేస్తామని హెచ్చరించారు. 18 ఏళ్లు నిండని బాలలచే పనులు చేయించరాదన్నారు. సప్తగిరి వైభవ్ క్లాత్ షాపులో పనిచేస్తున్న ఓ అమ్మాయికి, అప్‌డేట్ ఫ్యాషన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు అమ్మాయిలకు తక్కువ జీతం చెల్లిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. కార్మిక శాఖ అధికారులతో పాటు ఐసీడీఎస్, సీడ్స్ ఆర్గనైజేషన్, పోలీస్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. సబ్బవరం సీఐ రమణ, అనకాపల్లి సహాయ కార్మిక అధికారులు బాలకృష్ణ, నరేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీడ్స్ తరఫున చిన్నారావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

900 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత


పీడీఎస్ బియ్యం వ్యాన్‌తో పోలీసులు

పెందుర్తి: గాజువాక ప్రాంతం నుంచి సబ్బవరానికి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపు జగ్గరాజుపేట వద్ద టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. పూసర్ల అచ్చిబాబు అనే వ్యక్తి టాటా ఏస్ వాహనంలో 23 బస్తాల(900 కిలోల) పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్ ఎస్‌ఐ భరత్‌కుమార్, లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ అసిరితాత కలిసి కాపు కాసి వాహనాన్ని అడ్డుకున్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

చెప్పుల దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.15 లక్షల ఆస్తి నష్టం


కాలి బూడిదైన చెప్పులు, ఫర్నిచర్

పరవాడ: సంతబయలు గ్రామానికి చెందిన భూషణం చెప్పుల దుకాణంలో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం జరిగింది. వివరాలు.. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో దుకాణం మూసివేసి, భూషణం ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో షాపు నుంచి దట్టమైన పొగలు రావడాన్ని స్థానికులు గుర్తించి అనకాపల్లి, రాంకీ అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించారు. వెంటనే రాంకీ అగ్నిమాపక శకటం సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న చెప్పులు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయి, ముద్దగా మారాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని కొందరు, ఎవరో కావాలనే షాపునకు నిప్పు అంటించారని మరి కొందరు అంటున్నారు. చెప్పుల దుకాణం వెనుక వైపు నివసిస్తున్న సైకిల్ మెకానిక్ చెల్లయ్య అనే వ్యక్తికి చెందిన టైర్లు, ట్యూబులు కాలిబూడిదైనట్లు చెల్లయ్య వాపోయాడు. అగ్నిప్రమాదంపై పరవాడ రెవెన్యూ అధికారులు బాధితుల నుంచి వివరాలు సేకరించి, నివేదికను తహసీల్దార్ అంబేడ్కర్ అందించారు.

సంబరంగా ముత్యమాంబ పండగ


అంతకాపల్లి ముత్యమాంబ తొలేళ్ల సంబరంలో పూలరథం ఊరేగింపు

సబ్బవరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లి, అంతకాపల్లి ముత్యమాంబ అమ్మవారి అనుపు మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పరిసర గ్రామాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ప్రారంభించారు. తొలేళ్ల సంబరంలో భాగంగా బుధవారం రాత్రి అంతకాపల్లిలో అమ్మవారిని పూలరథంపై ఊరేగించారు. వేలాదిగా భక్తులు ఈ ఉరేగింపు మహోత్సవంలో పాల్గొన్నారు.

- మండలంలోని బంగారమ్మపాలెంలో కొలువైన ముత్యమాంబ పండగ మహోత్సవం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. గ్రామ పెద్దలు రాపేటి రాము, దాడి కన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై కామదహన పూజలు


సింహగిరి మాడ వీధిలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై గురువారం రాత్రి కామదహనం పూజలు విశేషంగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను తిరువీధిగా మాడవీధిలో ఊరేగించి, జోడు భద్రాలవద్ద కొలువుంచారు. అనంతరం హోమం, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు చక్రవర్తి, శ్రీకాంత్, వేద పండితులు ఈ పూజలు జరిపారు.